క్లుప్తంగా

సూర్యాపేట రూరల్ సీఐగా రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ



సూర్యాపేటటౌన్ : సూర్యాపేట రూరల్ సీఐగా రాజశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సీఐ సురేందర్‌రెడ్డి బదిలీపై వెళ్లడంతో సూర్యాపేట పట్టణ సీఐగా పనిచేసిన రాజశేఖర్‌ను రూరల్‌కు బదిలీ చేశారు.

మండల వైద్యాధికారిగా రాజేష్



పెన్‌పహాడ్ : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండో వైద్యాధికారిగా రాజేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తానని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల సన్మానం



మార్కెట్ చైర్మన్, యూత్ అధ్యక్షులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నూతనకల్ : తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, నూతనంగా ఎన్నికైన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్‌లను వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు గురువారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బత్తుల నాగమల్లు, కారింగుల ఏకస్వామి, పార్టీ రైతు జిల్లా కోఆర్డినేటర్ బాణాల సుదర్శన్‌రెడ్డి, ఉప్పుల పాపయ్య, బాణాల మల్లారెడ్డి, వెంకన్న, క్రాంతి, సురేష్ పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న దాతలు

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం సోంబాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని చిల్పకుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన పెద్దింటి సత్తెమ్మ–సూరారెడ్డి జ్ఞాపకార్థం వారి కూతుళ్ల ఆర్థిక సహకారంతో విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయ్‌రెడ్డి, ఇమ్మారెడ్డి మహేష్‌రెడ్డి, ఇమ్మారెడ్డి లింగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

అర్వపల్లి : నకిరేకల్–తానంచర్ల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడ్డారు. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండలంలోని బొల్లంపల్లి సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలంలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన దావుల సోమయ్య–శోభ దంపతులు ఆటోలో గ్రామాల్లో తిరుగుతూ ఎల్లిగడ్డ వ్యాపారం చేస్తుంటారు. గురువారం రాత్రి వ్యాపారం చేసుకొని అర్వపల్లి నుంచి తిరిగి స్వగ్రామం వస్తుండగా బొల్లంపల్లి స్టేజీ సమీపంలోకి రాగానే తుంగతుర్తి వైపు నుంచి ఎదురుగా వచ్చిన ఓ కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో చికిత్స కోసం సూర్యాపేటకు తరలించారు.

ఇసుక రవాణాపై అవగాహన

నూతనకల్ : ప్రభుత్వం తీసుకువచ్చిన 'మన ఇసుక వాహనం' వెబ్‌సైట్‌పై మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ట్రాక్టర్ యజమానులకు తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని బిక్కుమళ్ల గ్రామ శివారులోని పాలేరువాగు నుంచి ఇసుకను రవాణా చేయడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ట్రాక్టర్ యజమానులు ఇసుక రవాణా చేసుకోవడానికి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, ట్రాక్టర్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం మండల పంచాయతీ అధికారి గోపి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోని కేంద్రాలను పరిశీలించి తగిన వసతులు కల్పించాలని సూచించారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముందస్తుగా పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించి వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీఓ తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి నెహ్రూ నాయక్, మాగి నాగయ్య, సిబ్బంది ఉన్నారు.

లింక్‌రోడ్డుకు బీటీ వేసేదెప్పుడో..?

- అధ్వానంగా అడివెంల–తిమ్మాపురం డొంకదారి
- వర్షపు నీటితో నిండి రాకపోకలకు పాట్లు
- దారి సరిగా లేక తిమ్మాపురం పాఠశాలకు వెళ్లని విద్యార్థులు



నీటితో నిండిన అడివెంల–తిమ్మాపురం డొంకదారి



కంపచెట్లతో మూసుకుపోయిన దారి

అర్వపల్లి: మండల పరిధిలోని అడివెంల–తిమ్మాపురం గ్రామాల లింక్‌రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలకు రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడివెంల నుంచి తిమ్మాపురం వరకు కిలోమీటరున్నర దూరం ఉంటుంది. అయితే ఈ దారి పూర్తిగా డొంకదారి కావడంతో వర్షపునీటితో నిండి కంపచెట్లతో అల్లుకుపోయింది. అడివెంలలో ప్రాథమిక పాఠశాల వరకు ఉండటంతో ఉన్నత పాఠశాల కోసం గ్రామం నుంచి ప్రతి రోజు 20 మందికి పైగానే పిల్లలు అక్కడి పాఠశాలకు ఈ దారి నుంచే వెళుతుంటారు. వర్షాలకు ఈ డొంకదారి వర్షపు నీటితో నిండి కంపచెట్లతో అల్లుకుపోయింది. దీనికి తోడు తిమ్మాపురంలోని పోస్టాఫీసుకు పింఛన్లు, ఉపాధిహామీ బిల్లుల కోసం నిత్యం గ్రామస్తులు అక్కడికి వెళుతుంటారు. ఈ దారి సరిగా లేక అడివెంల స్టేజి మీదుగా 8 కిలోమీటర్లు అదనంగా దూరం పోవాల్సి వస్తుంది.

మంత్రి హామీని నెరవేర్చాలి

పార్లమెంట్ ఎన్నికల ముందు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆలయ ప్రారంభోత్సవం కోసం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి వెంకట్‌రెడ్డి అడివెంల–తిమ్మాపురం డొంకదారిని బీటీగా చేయిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చి బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాకపోకలు నిలిచాయి



"అడివెలం– తిమ్మాపురం డొంకదారి ప్రస్తుతం వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు బందయ్యాయి. ఈ రోడ్డును బీటీగా మార్చుతాననే మంత్రి హామీని నెరవేర్చాలి.

– బోయిళ్ల తిరుమల్, అడివెంల

రోడ్డు సరిగా లేక ఇబ్బంది పడుతున్నాం



"లింక్‌రోడ్డు అధ్వానంగా మారడంతో తిమ్మాపురానికి పోస్టాఫీసు కోసం పింఛన్లు, ఉపాధి డబ్బుల కోసం వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాం. అలాగే ఈ దారి వెంట 100మందికి పైగానే భూములున్నాయి. ఈ రైతులు పొలాల వద్దకు వెళ్లడానికి నిత్యం అవస్థల పాలవుతున్నారు.

– పేరెల్లి ఉప్పలయ్య, అడివెంల

మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

చివ్వెంల : మహిళలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు వెంటనే అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి మద్దెల జ్యోతి అన్నారు. గురువారం మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై దాడులు పెరిగాయని, వయసుతో సంబంధం లేకుండా లైంగిక దాడులు, హత్యలు, అత్యాచారాలు, వేధింపులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇటీవల పని ప్రదేశాల్లో ఫిర్యాదులు వస్తున్నాయని, పనిప్రదేశాల్లో ఫిర్యాదుల బాక్స్‌లు ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు చెప్పినా అమలు కావడం లేదన్నారు. సమావేశంలో కవిత, మేకన బోయిన సైదమ్మ, పిండిగా నాగమణి, ఆవుదొడ్డి భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న బీజేపీ



హమాలీ కార్మికులతో మాట్లాడుతున్న కృష్ణ

పెన్‌పహాడ్ : కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుందని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో హమాలీ, మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశమై ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులు, కర్షకులు ఎంతో పోరాడి సాధించుకున్న చట్టాలను కాలరాస్తూ కార్మికులకు రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడంలో, సంక్షేమ పథకాలు కార్మికులకు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈనెల 7న సీఐటీయూ ఆధ్వర్యంలో సూర్యాపేటలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించే విస్తృత స్థాయి జిల్లా సమావేశానికి కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు భిక్షం, వెంకన్న, విజయ్, మధ్యాహ్న భోజన కార్మికులు అమ్మని, సరస్వతి, మానస, ఆదెమ్మ, వెంకటమ్మ, స్వాతి పాల్గొన్నారు.

మాజీ మంత్రి అరెస్ట్ హేయమైన చర్య



పెన్‌పహాడ్ : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ అనిత

చివ్వెంల : సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లకుంట్ల అయోధ్య అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. అక్రమ అరెస్టులతో భయపడితే భయపడేది లేదన్నారు. సమావేశంలో న్యాయవాదులు జటంగి వెంకటేశ్వర్లుయాదవ్, మోదుగు వెంకట్‌రెడ్డి, తల్లమల్ల హస్సెన్, గోండ్రాల అశోక్, అల్లంనేని వెంకటేశ్వర్‌రావు, అనుములపురి సైదులు, చిరంజీవి, మల్లయ్య, శ్రీను, అబ్దుల్ లతీఫ్, చిరంజీవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

పెన్‌పహాడ్ : మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, హరీష్‌రావుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని మాజీ జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని అనంతారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్లిన మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, హరీష్‌రావులను అరెస్టు చేయడం హేయమైన చర్య అని, ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మామిడి అంజయ్య, చిట్టెపు నారాయణరెడ్డి, దండెంపల్లి సత్యనారాయణగౌడ్, మస్తాన్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మాజీ మంత్రులు హరీష్‌రావు, జగదీష్‌రెడ్డిలను అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్బంధ పాలన కొనసాగిస్తుందని, పోలీసులను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు యాకోనాయక్, సుధాకర్, రవినాయక్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

మద్దిరాల : మాజీ మంత్రులు హరీష్‌రావు, గుంటకండ్ల జగదీష్‌రెడ్డిలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎస్‌ఏ.రజాక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని కలవడానికి వెళ్లిన మాజీ మంత్రులను అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోడి శ్రీనివాస్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వడ్డాణం మధుసూదన్, నర్సయ్య, రామూర్తి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



చివ్వెంల : సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు



తిరుమలగిరి : తొండలో మట్టి నమూనాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

చివ్వెంల : రైతులు తమ పొలాల్లో సేంద్రియ ఎరువులు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి డి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిలో ప్రపంచ మృతిక దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేల కలుషితం కాకుండా భవిష్యత్ తరాలకు సుస్థిరమైన, స్థిరమైన సజీవ వనరుగా అందించడం మన బాధ్యత అన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు బి.శైలజ, కె.వెంకట్‌రెడ్డి, సహస్, రైతులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల పరిశీలన

తిరుమలగిరి : మండలంలోని తొండ గ్రామ రైతు వేదికలో గురువారం వరల్డ్ సాయిల్ హెల్త్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడారు. మట్టి నమూనాలను ఎలా సేకరించాలి, మట్టి ఉపయోగాలు, మట్టిని ఏ విధంగా కాపాడుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మట్టితోనే మానవ మనుగడ



ఆత్మకూర్(ఎస్) : మట్టి నమూనాల గురించి వివరిస్తున్న వ్యవసాయాధికారిణి దివ్య

ఆత్మకూర్(ఎస్) : మట్టితోనే మానవ మనుగడ ఉంటుందని మండల వ్యవసాయాధికారిణి దివ్య అన్నారు. గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆత్మకూరు రైతు వేదికలో భూసార పరీక్ష నమూనాలపై వివరించారు. ఈ సందర్భంగా మట్టిని సేకరించే విధానం, భూసార పరీక్ష చేయించుకోవడంతో కలిగే ప్రయోజనాలు, ఎరువుల వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పవన్, రైతులు వీరారెడ్డి, నరేందర్, వినయ్, లింగయ్య, ఎల్లయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి



పెన్‌పహాడ్ : సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్

పెన్‌పహాడ్ : రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని అనాజీపురం రైతు వేదికలో నిర్వహించిన ప్రపంచ మృత్తిక దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు కేవలం ఒకే రకమైన పంటలు వేసుకోకుండా సమగ్ర వ్యవసాయ విధానాలను పాటిస్తూ అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. నేల సారవంతం తగ్గడానికి గల కారణాలు, నేల ఆరోగ్య పరిరక్షణకు పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ మురళీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మల్లు వెంకటనర్సింహారెడ్డి సేవలు మరువలేనివి



చివ్వెంల : వీఎన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


నాగారం : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లు వెంకటనర్సింహారెడ్డి సేవలు మరువలేనివని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం అన్నారు. గురువారం మండల కేంద్రంలో వెంకటనర్సింహారెడ్డి 20వ వర్ధంతిని పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారం ఎక్స్‌రోడ్డులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు దేవరకొండ యాదగిరి, వెంకటేశ్వర్లు, మల్లయ్య పాల్గొన్నారు.

వీఎన్ ఆశయ సాధనకు కృషి చేయాలి

నూతనకల్ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు, సీపీఎం నాయకుడు మల్లు వెంకటనర్సింహారెడ్డి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వీఎన్ 20వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అందెపల్లి లక్ష్మయ్య, బొజ్జ శ్రీను, తొట్ల శేఖర్, బాణాల మధుసూదన్‌రెడ్డి, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, చీమల లింగయ్య, రామసాని శ్రీనివాస్‌రెడ్డి, ఇరుగు రమేష్, మహేష్, లింగయ్య, ఇందిరమ్మ, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మల్లు వెంకటనర్సింహారెడ్డి (వీఎన్) వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట గోపి, పిండిగ నాగమణి, ఉయ్యాల నగేష్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, యలమంచమ్మ, సోమలక్ష్మి, మల్లమ్మ, జానమ్మ, వీరమ్మ, సైదమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : తెలంగాణ సాయుధ పోరాటయోధుడు మల్లు వెంకటనర్సింహారెడ్డి వర్ధంతిని మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి పూలోజు సైదులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు దీకొండ ఉపేందర్, పెరుమాళ్ల మోష, వీరయ్య, సోమయ్య, లక్ష్మయ్య, మరియమ్మ, రఘు పాల్గొన్నారు.



నూతనకల్ : వీఎన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలను రద్దుచేయాలి



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

భానుపురి (సూర్యాపేట) : వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలకు కారణం అవుతున్న నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలను రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూల్లూరి సింహాద్రి, చందర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక 60 ఫీట్లరోడ్డులో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కనీస సౌకర్యాలు లేకుండా నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలను నడుపుతున్నారని, ర్యాంకులు, మార్కుల కోసం ధనార్జన ధ్యేయంగా విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ప్రతి సంవత్సరం వందల మంది చనిపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ విద్యాసంస్థలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, నాయకులు సంధ్య మానస, స్వప్న, నందిని, వర్షిత, మహేష్, పవన్, వినయ్ పాల్గొన్నారు.

వర్గీకరణపై మాలల కుట్రను తిప్పికొడతాం



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై మాలల కుట్రలను తిప్పికొడతామని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్నమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు మాదిగ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ సమావేశాన్ని మండల ఇన్‌చార్జ్ మోలుగురి రాజు మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పునిస్తే తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేయకుండా మాదిగలను మోసం చేస్తుందన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సూర్యాపేట కో ఆర్డినేటర్ ఎర్ర వీరస్వామి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముల్కలపల్లి రవి, కొండమీది వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అడ్డగింత



గురుకుల పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తుంగతుర్తి : ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు వెళ్తున్న తమను ప్రభుత్వం అడ్డుకుంటుందని, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే అడుగడుగునా ఈ అడ్డగింత అని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శిగ వెంకటేష్‌గౌడ్, జిల్లా కోఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని టీఎస్ఆర్ బాలుర గురుకుల పాఠశాలను బీఆర్ఎస్వీ రాష్ట్ర బృందం పరిశీలించేందుకు వెళ్లగా ముందుగానే విషయం తెలుసుకున్న గురుకుల పాఠశాల యాజమాన్యం పాఠశాల గేట్లను మూసివేసి తాళాలు వేయడంతో పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో అనేక గురుకుల బాలుర పాఠశాలలకు ప్రహరీ సరిగ్గా లేవని, విద్యార్థులు పడుకోవడానికి వసతులు, మరుగుదొడ్లు సక్రమంగా లేవని, తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గురుకులాలు సమస్యల వలయంలో కొట్టు మిట్టాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు గునిగంటి సంతోష్, వడ్డేపల్లి సందీప్, వేల్పుకొండ రామకృష్ణ, మెండే సురేష్, గోపగాని శ్రీనివాస్, వెంకన్న, ఉప్పుల నాగమల్లు, వెంకటేష్, మల్లికార్జున్, మట్టిపల్లి వెంకట్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

పెన్‌పహాడ్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తుండడంతో పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు జి.ఆనందభాస్కర్ తన సొంత ఖర్చులతో వాలీబాల్ అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె.రవి పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

అర్వపల్లి : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నగరిగారి ప్రీతంతో కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్ రైతు పక్షపాతి

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు జాజుల వీరయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, అనంతుల వెంకటయ్య, మంగదుడ్ల దశరథ, లైన్‌మెన్‌లు ఆనందరావు, పోతుగంటి అంజయ్య, రైతులు బొబ్బిలి గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ దయానందం అన్నారు. ప్రజాపాలన –ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంతో పాటు, సంగెం, సింగారంతండా, రావుపల్లి గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే ప్రజలకు ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ జాన్‌ప్రెడ్, డీటీ కంఠమయ్య, ఆర్ఐ శ్రీనివాస్, కార్యదర్శి శేఖర్, సాంస్కృతిక సారథి టీంలీడర్ ఈర్ల సాయి, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, పాలకుర్తి శ్రీకాంత్, మాగి శంకర్, పాక ఉపేందర్, మేడిపల్లి వేణు, మంజుల, రాధ, శిరీష, ప్రజలు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా శ్రావ్య




పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నాగులపహాడ్ గ్రామానికి చెందిన శ్రావ్య యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ ఎన్నికకు సహకరించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు కొప్పుల వేణారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు, మండల అధ్యక్షుడు సురేష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాధవరెడ్డి




ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన నల్లెడ మాధవరెడ్డి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఇటీవల యూత్ కాంగ్రెస్ కమిటీల కోసం నిర్వహించిన ఎన్నికల్లో 6000ఓట్లకు పైగా మెజార్టీతో మాధవరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనపై నమ్మకంతో ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి, తన గెలుపు కోసం కృషి చేసిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, సర్వోత్తమ్‌రెడ్డి, వేణారెడ్డి, చెవిటి వెంకన్నతో పాటు ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా మనోజ్‌కుమార్



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని వేల్పుచర్ల గ్రామానికి చెందిన కొత్తపల్లి మనోజ్‌కుమార్ యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయనను గురువారం జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, చిక్కుల శేఖర్, శ్రీను, మహేష్, వజ్జ రవి, శ్రీధర్ తదితరులు అభినందించారు.

జనరల్ సెక్రటరీగా భూక్యా కుమార్



తిరుమలగిరి : మండలంలోని ఈదులపర్రెతండాకు చెందిన భూక్యా కుమార్ యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు.